క్లుప్తంగా

నియోజకవర్గ ప్రొఫైల్‌ను సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న సీపీఓ ప్రసన్నలక్ష్మి

నరసన్నపేట: నియోజకవర్గం గురించి మొత్తం కొన్ని క్షణాల్లో తెలుసుకొనేలా ప్రొఫైల్‌ను సిద్ధం చేయాలని మండల స్థాయి అధికారులకు సీపీఓ ప్రసన్నలక్ష్మి సూచించారు. ఈ నెల 15వ తేదీ నాటికి కల్లా ప్రొఫైల్ సిద్ధం కావాలన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మధుసూదనరావు, ఇతర శాఖల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని మండలాల వారీగా వివరాలు ఉండాలన్నారు. నియోజకవర్గంలో ఆదాయ వివరాలతోపాటు మౌలిక వసతులు, వనరులు, పంటలు వాటి ద్వారా వచ్చే ఆదాయం, ఆధారపడి ఉన్న జనాభా, పారిశ్రామికం, వ్యాపారం, ఉద్యానవన పంటలు, మత్స్యసంపద ఇలా అన్ని వివరాలు ప్రొఫైల్‌లో ఉండాలన్నారు. దీనికి సంబంధించిన మోడల్‌ను వివరించారు. అనవరమైన టెక్నికల్ సహాయం అందిస్తామని, వివరాలు సేరించాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉందన్నారు.

కొత్తూరు ఎక్సైజ్ ఎస్ఐగా వాసుదేవరావు



కొత్తూరు: కొత్తూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా వాసుదేవరావు శనివారం నియమితులయ్యారు. ఇంతవరకు ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో హెచ్‌సీగా పనిచేశారు. సారా అక్రమ రవాణా, సారా వంటలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సబ్‌జైల్ తనిఖీ



సౌకర్యాలపై ఆరా తీస్తున్న సివిల్ జడ్జి వాణి

నరసన్నపేట: స్థానిక సబ్‌జైల్‌ను నరసన్నపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి శనివారం తనిఖీ చేశారు. ముద్దాయిలకు నాణ్యమైన ఆహారం అందుతుందా, లేదా అని ఆరా తీశారు. ముద్దాయిల ఆరోగ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలని జైలు అధికారులకు సూచించారు. ముద్దాయిలకు ఆరోగ్య సూత్రాలు, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై తగిన సలహాలు ఇచ్చారు. ముద్దాయిలు ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని, అవసరమైనవారు దరఖాస్తు చేసుకొంటే న్యాయవాదిని సమకూర్చుతామన్నారు. న్యాయవాది రావాడ కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

175 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు గ్రామంలో శనివారం రిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెట్టూరు, మెట్టూరు బిట్-1, 2, 3 ఆర్‌ఆర్ కాలనీతో పాటు పలు గ్రామాలకు చెందిన 175 మందికి వైద్య పరీక్షలు చేపట్టారు. పలువురికి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిఫర్ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య నిపుణులు సి.హెచ్.సాస్విక్ చింజీవి, డీఎంఓ ఝాన్సీ, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. మెట్టూరుకు చెందిన గడ్డివలస కమలాకర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

నేటి నుంచి చెవిటమ్మ పండగలు

ఎల్.ఎన్.పేట: ఈ నెల 4 వ తేదీ నుంచి మండలంలోని దబ్బపాడు గ్రామంలో గల చెవిటమ్మ (సుమంతాపురం) అమ్మవారి గ్రామ దేవత ఘటాల పండగను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు పండగలు నిర్వహిస్తామన్నారు. ఆదివారం సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజలు ఉంటాయన్నారు. సోమవారం అమ్మవారికి ముర్రాటల సమర్పణ, కుంకుమ పూజలు, ఆధ్యాత్మిక, భక్తి పాటలతో కోలాట నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. మంగళవారం ఘటాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించటంతోపాటు వేట పూజలు ఉంటాయన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

సమ్మర్ కోచింగ్‌లు నిర్వహిస్తే చర్యలు

నరసన్నపేట: వేసవి సెలవుల్లో (సమ్మర్) కోచింగ్‌లు నిర్వహించి విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దని, అనుమతి లేకుండా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు అన్నారు. శనివారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ప్రైవేట్ స్కూల్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం కార్పొరేట్ స్కూళ్లల్లో 25 సీట్లు పేదలకు ఇవ్వాలన్నారు. దీనికి సంబంధించిన డేటాను, స్కూల్స్ వివరాలను ఆన్‌లైన్‌లో ఆయా యాజమాన్యాలు పెట్టాలన్నారు.

భూసార పరీక్ష.. పంటకు శ్రీరామరక్ష

- మట్టి నమూనా సేకరణకు ఇదే అనువైన సమయం
- రైతు సేవా కేంద్రాల సహాయంతో పరీక్షల నిర్వహణ
- ఫలితాల ఆధారంగా పంటల సాగు, ఎరువుల వినియోగం
- నరసన్నపేట నియోజకవర్గంలో 5,850 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం



ఉర్లాంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది, రైతులు

నరసన్నపేట: రసాయనిక ఎరువులు ఇష్టారాజ్యంగా వినియోగించడంతో భూములు సారాన్ని కోల్పోతున్నాయి. దిగుబడులు తగ్గితున్నాయి. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎరువులు అధికంగా వాడకుండా భూసారం మేరకు వినియోగం, ప్రకృతి వ్యవసాయం చేయాల్సిన అవసరం ఉంది. భూమిలో ఎటువంటి పోషక విలువలున్నాయో ఏటా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. దీని ప్రకారం పంటల ఎంపిక, ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు చేస్తే మంచి ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ అధికారులు అంటున్నారు. భూమిలో ప్రధాన పోషకాలైన నత్రజని, బాస్వరం, పోటాష్ పరిమాణాల్లో మార్పులను భూసార పరీక్షల ద్వారా గుర్తించవచ్చు.

సూక్ష్మ పోషకాలే కీలకం..

- స్థూల, సూక్ష్మ పోషకాలుగా పిలవబడే నత్రజని, బాస్వరం, పొటాష్, జింకు, బోరాన్, సల్ఫర్, కాల్షియం, మెగ్నీషియం, జిప్సం లోపిస్తే పంట దిగుబడుల్లో తేడాలు కనిపిస్తాయి.
- భూసార పరీక్షలు చేసిస్తే ఈ లోపాన్ని గుర్తించేందుకు వీలుంటుంది. లోపాన్ని గుర్తించి సకాలంలో వాటిని వేసుకొని దిగుబడులు పెంచుకోవచ్చు..

మట్టిని ఇలా సేకరించాలి..

- చౌడు, ఆమ్ల నేలల్లో ఇతర ఏ సమస్యాత్మక నేలల్లోనైనా వేర్వేరుగా మట్టి నమూనాలను సేకరించాలి. 15-30 సెంటీ మీటర్ల లోతులోని మట్టిని సేకరించాలి.
- జిగ్‌జాగ్ పద్ధతిలో ఎకరాకు 8 నుంచి 10 చోట్ల రెండు కేజీల మట్టిని సేకరించాలి.
- సేకరించిన మట్టిలో గడ్డలు లేకుండా నాలుగు భాగాలుగా చేయాలి. ఒక్కో భాగంలో కొంత మట్టిని తీసుకొని కిలో మట్టిని నమూనాకు పంపాలి.
- పోషకల లోపాలు నివారించడానికి జిప్సం, జింకు, పచ్చిరొట్ట ఎరువులను, నవధాన్యలను సాగు చేయాలి.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



భూసార పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం. రైతులు గమనించి వారి భూముల్లో మట్టి నమూనాలను ఆయా రైతు సేవా కేంద్రాలోని వీఏఏల ద్వారా పరీక్షలకు పంపాలి. మండలాల వారీగా ఇచ్చిన లక్ష్యాలు మేరకు జూన్ ఆఖరు కల్లా నమూనాలు సేకరణపూర్తి చేయాలి. నమూనా ఫలితాలను కూడా వెంటనే రైతులకు అందించి తగిన సూచనలు చేయాలి.

– ఏడీ రవీంద్రభారతి, నరసన్నపేట

నరసన్నపేట నియోజకవర్గంలో మట్టి నమూనా సేకరణ వివరాలు ఇలా..				
మండలం	నరసన్నపేట	పోలాకి	జలుమూరు	సారవకోట
లక్ష్యం	1460	1552	1555	1313
సేకరణ	462	455	677	717

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

నరసన్నపేట: స్థానిక ప్రైవేట్ ఐటీఐ వద్ద ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నిరుద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ఏఐవైఎఫ్ నరసన్నపేట నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, సాంబశివరావు అన్నారు. అనేక ఉద్యమాల్లో ఏఐవైఎఫ్ ప్రముఖ పాత్ర వహించిందన్నారు. ఏఐవైఎఫ్ నాయకులు వసంత్, క్రాంతి, వాసు, శ్యామ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించండి



మాట్లాడుతున్న ఎంఈఓ పద్మనాభరావు

మెళియాపుట్టి: పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని మెళియాపుట్టి ఎంఈఓ-2 పద్మనాభరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి పిల్లల్ని బడుల్లో చేర్పించాలన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల కదలికలను గమనించాలన్నారు. హెచ్‌ఎం గణపతిరావు, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

మెళియాపుట్టి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. సుమారు గంటన్నరపాటు కురిసిన వర్షానికి ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. పంట చేతికందొచ్చిన సమయంలో గాలులతో పంటంతా రాలిపోతుందని మామిడి రైతులు ఆందోళనలో ఉన్నారు. తూముకొండ రామచంద్రాపురం గ్రామానికి సమీపంలో విద్యుత్ తీగలు రహదారిపై తెగిపడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



తూముకొండ రామచంద్రాపురం సమీపంలో రహదారిపై తెగిపడిన విద్యుత్ తీగలు

7 నుంచి కల్యాణ మహోత్సవాలు

పొందూరు: మండలంలోని తండ్యాం పంచాయతీ మన్నెపేట కొండపై ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ, దుర్గాభవానీ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. 7న ధ్వజస్తంభ పతాక ప్రతిష్ట, 8న మండపార్చనలు, 9న కుంకుమపూజలు, 10న అలివేలుమంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణరాట, తిరువీధి, 11న కల్యాణ మహోత్సవం, అన్నసమారాధన ఉంటాయన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కోదడ్డపనస సమీపంలో వంతెనకు ఇరువైపులా విరిగిపోయిన రైలింగ్

- శిథిలావస్థలో వంతెనలు
- పట్టించుకోని వంశధార అధికారులు

సారవకోట: మండలంలోని వంశధార కాలువపై పలు చోట్ల నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. బైదాలాపురం నుంచి చీడిపూడి వరకు వంశధార ఎడమ కాలువలో నీరు ప్రవహిస్తుంది. ఈ కాలువపై బైదాలాపురం, అక్కివలస, కోదడ్డపనస, కిన్నెరవాడ, చీడిపూడి గ్రామాల సమీపంలో వంతెనలున్నాయి. బైదాలాపురం వంతెన గత కొన్నేళ్ల క్రితం కూలిపోగా.. ప్రస్తుతం నిర్మాణ పనులు చేపడుతున్నారు. కోడ్డపనస సమీపంలో నిర్మించిన వంతెనకు ఇరువైపులా రైలింగ్‌లు కూలిపోయాయి. కిన్నెరవాడ, చీడిపూడి గ్రామాలకు సమీపంలో ఉన్న వంతెనలు ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ మార్గాలలో వెళ్లే వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. అక్కివలస సమీపంలో ఉన్న పాత వంతెనకు పక్కనే కొత్త వంతెనను గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు. అయినప్పటికీ పాత వంతెనపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ వంతెన ఎప్పుడు కూలుతుందోనని భయాందోళన చెందుతున్నారు. దీనిపై వంశధార అధికారులు స్పందించి పాత వంతెనపై ఎటువంటి రాకపోకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



వంశధార కాలువపై పలుచోట్ల ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని సంబంధిత అధికారులు పరిశీలించాలి. ప్రమాదాలు జరగక ముందే స్పందించి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

– నిక్కు కృష్ణారావు, మాజీ ఎంపీటీసీ, చీడిపూడి

ఆలయ మాజీ చైర్మన్ ఈశ్వరరావు మృతి



ఈశ్వరరావు (ఫైల్)

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గ ఆలయ మాజీ చైర్మన్ నూలు ఈశ్వరరావు (57) అనారోగ్యంతో శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఆలయ చైర్మన్‌గా సేవలు అందించారు. అలయాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఈయనకు భార్య అనురాధ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పలువురి సంతాపం..

ఈశ్వరరావు మృతిపై పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, ఐటీ వింగ్ విభాగం అధ్యక్షుడు ఎనుగుతల సూర్యం, పార్టీ నాయకులు సంతాపం తెలియజేశారు.

ఆర్థికసాయం



నగదు, బియ్యం పాకెట్లు అందజేస్తున్న లక్ష్మణరావు

కొత్తూరు: మండల కేంద్రంలోని కొత్తపేట కాలనీలో అగ్నిప్రమాద బాధితురాలు కోగాన పద్మకు కొత్తూరుకు చెందిన పడాల లక్ష్మణరావు రూ.పది వేల నగదు, బియ్యం ప్యాకెట్లు శనివారం అందజేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా కృషి చేస్తానని లక్ష్మణరావు అన్నారు.

రహదారి పనులు ప్రారంభం

కొత్తూరు: స్థానిక పంచాయతీ పరిధి ఎస్ఎస్ కాలనీలో గల పోల ఆదినారాయణ వీధిలో శనివారం రోడ్డు పనులను వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు ప్రారంభించారు. పంచాయతీ నిధులను కేటాయించినట్లు స్థానిక సర్పంచ్ పడాల కృష్ణవేణి తెలిపారు. జనార్దనరావు, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి క్రికెట్ టోర్నమెంట్

సరుబుజ్జిలి: ఈ నెల 8 నుంచి పురుషోత్తపురంలో కిల్లి అప్పలనాయుడు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలపారు. పోటీల్లో గెలిపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.25 వేలు, 2వ బహుమతి రూ.15 వేలు, బెస్ట్ బౌలర్, బ్యాట్స్‌మన్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఉంటాయన్నారు. ఎంట్రీ ఫీజు రూ.1,000 చెల్లించాలని, పూర్తి వివరాలకు 9014184634, 95738 96564 నంబర్లను సంప్రదించాలన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన

పొందూరు: కార్మికులు తమ హక్కులను కాపాడుకునేందుకు కార్మిక చట్టాలు రక్షణ కల్పిస్తాయని పొందూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. పొందూరు కోర్టు సమీపంలోని మార్కెట్ యార్డులో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ వేతనదారులకు కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు, ఉపాధి ఏపీఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

పాతపట్నం: మండలంలోని పాతపట్నం-1, బూరగాం, తెంబూరు గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ఆరు ఏళ్లలోపు పిల్లలకు కొత్తగా ఆధార్ నమోదు చేసేందుకు ప్రత్యేక క్యాంపులను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ పి.చంద్ర కుమారి శనివారం తెలిపారు. చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

25 శాతం సీట్లు కేటాయించాలి

బూర్జ: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఆయా యాజమాన్యాలు కేటాయించాలని ఎంఈఓలు శ్యామసుందరరావు, ధనుంజయరావు శనివారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: రాష్ట్ర రాజధాని అమరావతి పేరుతో కూటమి నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సింగపూర్ తరహా రాజధాని నిర్మిస్తామని చెప్పి హాలివుడ్ తరహా గ్రాఫిక్స్ చూపెడుతున్నారన్నారు. ఏడాదికి మూడు పంటలు పండించే 70 వేల ఎకరాలను వేలాది మంది రైతుల నుంచి సేకరించి వారిని రోడ్డున పడేశారన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలు కంటే రాజకీయ ప్రయోజనాలే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ముఖ్యమన్నారు. ఇప్పటికే రాజధాని నిర్మాణం కోసం 58 వేల ఎకరాలు అందుబాటులో ఉండగా.. మరో 44 వేల ఎకరాలు ఎందుకని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు ఏడాది అవుతున్నా.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు.

పరామర్శ..



రవీంద్రబాబును పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు



రవీంద్రబాబును పరామర్శిస్తున్న తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: మున్సిపాలిటీలోని గేదెలవానిపేట జంక్షన్ వద్ద నివాసముంటున్న విశ్రాంత ఎంపీడీఓ మునగవలస రవీంద్రబాబు తల్లి సరోజనమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం వేర్వేరుగా వెళ్లి పరామర్శించారు. పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, నాయకులు పొన్నాడ చిన్నారావు, కూన రామకృష్ణ, ఎ.రవికాంత్, తదితరులు ఉన్నారు.

రోడ్డు వేశారు.. కల్వర్టు మరిచారు..



నరసన్నపేట మండలం బాలసీమ నుంచి బసివలస వరకు కాంక్రీట్ రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. బాలసీమ రామాలయం సమీపంలోని కల్వర్టు వద్ద పైపులు వేసి మిగిలిన పనులు నిలిపివేశారు. వర్షం పడితే బురద మయంగా తయారవుతుంది. చుట్టు పక్కల మట్టి కూడా కరిగి గొయ్యి ఏర్పడుతుంది. వాహనదారులకు ఎటువంటి ప్రమాదాలు జరగక ముందే కల్వర్టు పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. – నరసన్నపేట

నాణ్యతకు తిలోదకాలు..



కొత్తూరు మండలంలోని దాశరదీపురం కూడలి (అలికాం-బత్తిలి రోడ్డు) సమీపంలో పెద్ద, పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. గతంలో ఇదే ప్రాంతంలో గోతులు ఏర్పడటంతో సాక్షిలో వార్త ప్రచురితమైంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులు చేపట్టి రెండు నెలలు కూడా గడవక ముందే మళ్లీ అదేచోట గోతులు ఏర్పడ్డాయి. – కొత్తూరు

ఆదమరిస్తే అంతే..



సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస నుంచి పురుషోత్తపురం వెళ్లే రహదారిలో యరగాం – పురుషోత్తపురం ఓపెన్ హెడ్ ఛానల్ బ్రిడ్జీ శిథిలావస్థకు చేరింది. రక్షణ గోడలు ఇరువైపులా పాడయ్యాయి. ఈదే చోట ఇటీవల కాలంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అధికారులు స్పందించి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వాహనదారలు కోరుతున్నారు. – సరుబుజ్జిలి

చెరువు కాదు.. రోడ్డే..



ఈ చిత్రం హిరమండలం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డులో ఏర్పడిన భారీ గొయ్యి. చిన్నపాటి వర్షానికి గొయ్యిలో నీరు చేరి చెరువును తలపిస్తుంది. తరచూ ఇక్కడ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. తక్షణం గోతులను పూడ్చే చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. – హిరమండలం

రెల్లి కులస్తులకు అన్యాయం



ర్యాలీ నిర్వహిస్తున్న రెల్లి కుల సంక్షేమం సంఘం ప్రతినిధులు

సరుబుజ్జిలి: ప్రభుత్వం తీసుకొచ్చిన దళిత వర్గీకరణ అసంబద్ధంగా ఉందని రాష్ట్ర రెల్లి కులాల సంక్షేమ సేవా సంఘం జిల్లా ప్రతినిధి గొల్లపల్లి సురేష్ అన్నారు. మూలసవలాపురం నుంచి సరుబుజ్జిలి వరకు రాష్ట్ర రెల్లి కులాల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఎస్సీ వర్గీకరణతో రెల్లి కులస్తులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎస్సీ గ్రూపులో ఇతర కులాలకు అధికంగా రిజర్వేషన్లు కల్పించి, రెల్లి కులస్తులకు కేవలం 1 శాతం కల్పిండం దారుణమన్నారు. రెల్లి సంక్షేమ సంఘం ప్రతినిధులు గొల్లపల్లి యర్రయ్య, మోహన్‌రావు, రామారావు, అర్జున్, సిరిపల్లి శ్రీను, జగదీష్, గణపతి పాల్గొన్నారు.